సోషల్ మీడియాలో.. ప్రచార జోరు

- టెక్నాలజీ ట్రెండ్‌ను వాడుకుంటున్న అభ్యర్థులు
- భానుడి ప్రతాపంతో సెల్‌ఫోన్‌లతోనే అభ్యర్థనలు
- వాయిస్ కాల్ ప్రచారాలు
- సిరిసిల్ల, వేములవాడలో కమిటీలు

8లో..

రిజర్వేషన్ల రద్దుపై ప్రమాణానికి సిద్ధమా?

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు సవాల్
- ఆ రెండు పార్టీలవి కుమ్మక్కు రాజకీయాలు
- ఆస్తిపాస్తులపై విచారణకు సిద్ధమా?
- కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్



ఎంపీ కార్యాలయంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రిజర్వేష్ల రద్దుపై ప్రమాణానికి సిద్ధమా అంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయ కులకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ సవాల్ విసిరారు. సోమవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయన్నారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలను కొట్టిపారేశారు. హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిన ఆరోపణలను తిప్పికొట్టారు. రిజర్వేషన్ల రద్దుపై ప్రమాణానికి సిద్ధమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు దమ్ముంటే దేవుడి ఎదుట ప్రమాణం చేద్దాం రండి అంటూ డేట్, టైం వేదిక మీరే డిసైడ్ చేయాలని సవాల్ విసిరారు. నేను అవినీతి పరుడినైతే మీ ఆస్తులపై, నా ఆస్తిపాస్తులపై విచారణకు సిద్ధమా అని ప్రశ్నించారు. ఓడిపోతామనే భయంతోనే ఆ రెండు పార్టీలు కలిసి విష ప్రచారం చేస్తున్నాయన్నారు. ఇదే విషయంపై ప్రమాణం చేసేందుకు సిద్ధమని, మా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కూడా ఒప్పించి తీసుకు వస్తానన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నమైన ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రమాణం చేసే దమ్ము మీకుందా అన్నారు. బండి సంజయ్ అవినీతి పరుడంటూ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ఆరోపణలపై తీవ్రంగా స్పందించారు. నేను అవినీతికి పాల్పడితే అధికారంలో ఉంది మీరే కదా చర్యలు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో బీఆర్ఎస్ భూస్థాపితం కావడానికి ప్రధాన కారణం కేటీఆర్ అన్నారు. ప్రజలు ఛీకొట్టినా అహంకారం తగ్గడం లేదన్నారు. అకాల వర్షాలతో రైతులు అల్లాడు తుంటే కేసీఆర్ రైతులకు నయాపైసా ఇవ్వలేదన్నారు. రైతుల పక్షాన, 317 జీవోపై ఉద్యోగుల పక్షాన పోరాటం చేశానన్నారు, నిరుద్యోగుల పక్షాన పోరాడి జైలుకు వెళ్లానన్నారు. జూన్ 4 తర్వాత బీఆర్ఎస్ పార్టీని పాతాళం లోకి తొక్కబోతున్నారన్నారు. కేటీఆర్ అక్రమా స్తులు, అరాచకాల చిట్టాను విప్పుతామన్నారు. నేను వారసత్వ రాజకీయాల చేయలేదని 1994లోనే అర్బన్ బ్యాంకు డైరెక్టర్‌గా గెలిచానన్నారు. 2005 నుంచి రెండు సార్లు కార్పొరేటర్‌గా, 2014, 18లో ఎమ్మెల్యేగా పోటీ చేశానన్నారు. 2019లో ఎంపీగా పోటీ చేసి 89 వేలకు పైగా మెజారిటీతో గెలిచానన్నారు.



శక్తి కేంద్రాల ఇన్‌ఛార్జిలసమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

మే 8న వేములవాడకు ప్రధాని మోదీ రాక?

- శక్తి కేంద్రాల ఇన్‌ఛార్జిలతో సమావేశం

భగత్‌నగర్, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్ని కల ప్రచారంలో భాగంగా భారత ప్రధాని నరేంద్రమోదీ మే 8న వేములవాడకు వచ్చే అవకాశం ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో సోమవారం కరీంనగర్ అసెంబ్లీ నియో జకవర్గ శక్తికేంద్ర ఇన్‌ఛార్జిల సమావేశం జరిగింది. సభను దిగ్విజయం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో డాక్టర్ జిమనోహర్‌రెడ్డి, మీసాల చంద్ర య్య, బోయినపల్లి ప్రవీణ్‌రావు, శ్రీనివాస్, గుగ్గిళ్లపు రమేష్, చొప్పరి జయశ్రీ ఉన్నారు.

- **బీజేపీలో భారీ చేరికలు**

సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గం ఏఐఎఫ్‌బి పార్టీ తరఫున పోటీ చేసిన పత్తిపాక సురేష్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరిన పలువురికి బండి సంజయ్‌కుమార్ కాషాయ కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీలో చేరిన వారిలో పిస్క వెంకటేష్, బుదారం సదానంద్, బీమని నగేష్, కొంపల్లి మురళి, గుడ్ల సురేష్‌కుమార్, శ్రీధర్, దాసరి వెంకటేష్, ఆడెపు లక్ష్మణ్, సత్య వికాస్, బలుసాని అనిల్, తుపాకుల రమేష్, శివపురం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. నగరంలోని లక్ష్మీనగర్‌కు చెరందిన మాజీ కాంగ్రెస్ నాయకుడు వి కిశోర్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరిన వారికి కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీలో చేరిన వారిలో వి నిర్సంహరాజు, బి నవీన్, కె నాగరాజు, సాయికిరణ్, మణిదీప్, సాయిక్రిష్ణ, సాయికుమార్ పాల్గొన్నారు. ఇల్లంతకుంట సర్పంచుల ఫోరం అధ్యక్షులు నారాయణ బీజేపీలో చేరారు. బీఆర్ఎస్‌కు చెందిన 26వ డివిజన్ యువ నాయకుడు గసికంటి ఆరుణ్‌కుమార్ బీజేపీలో చేరారు.

- బీజేవైఎం నగర ఉపాధ్యక్షుడు కుంట రామకృష్ణ భౌతికదేహం వద్ద బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



బీజేపీలో చేరుతున్న వారికి కాషాయకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండి సంజయ్‌కుమర్

బీజేపీ, కాంగ్రెస్ గారడి మాటలు

- ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది
- కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



కందుగుల గ్రామంలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 29 : బీజేపీ, కాంగ్రెస్ నాయకుల గారడి మాటలను ప్రజలు నమ్మవద్దని, ఆరు గ్యారెంటీ హామీలతో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలను మోసం చేసిందని కరీంనగర్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కందుగుల, కనుకులగిద్దె గ్రామాల్లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నా కనీసం నవోదయ పాఠశాలను కేంద్రం నుంచి తీసుకరాలేదన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో రెండేళ్లకు ఒక్క సీఎం మారు తాడని అన్నారు. 2014-19 వరకు ఎంపీగా ఉన్న సమయంలోనే కరీం నగర్‌ను స్మార్ట్ సిటీగా, జాతీయ రహదారి, నూతన రైల్వేలైన్ల ఏర్పాటు విషయంలో పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఎండాకాలంలో కూడా సాగు నీరు ఇచ్చారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీళ్లు ఎత్తిపోస్తే కరెంటు బిల్లు వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం అంటున్నారన్నారు.



వినోద్‌కుమార్‌కు మద్దతు తెలుపుతున్న ప్రైవేట్ టీచర్లు

కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ఐదేళ్లలో బుడ్డ పైసా పనిచేయలేదన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో లబ్ధి కోసమే ఆరు గ్యారెంటీ హామీలతో ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ టూరిజం కార్పొ రేషన్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

- **బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపిన ప్రైవేట్ టీచర్లు**

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మున్సిపల్ పరిధిలో బీఆరెస్ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిలు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీణవంక నుంచి జమ్మికుంట మీదుగా కమలాపూర్ మండలం శనిగరం గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న ఆయనకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. దీంతో జమ్మికుంట ప్రధాన రహదారి, కొత్తపల్లి, రామన్నపల్లిలో ప్రచారం చేపట్టారు. కాన్వాయ్ నుంచి కిందకు దిగిన వినోద్‌కుమార్ వారితో మాట్లాడారు. ప్రైవేట్ టీచర్లు బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, కెడి సిసి వైస్ చైర్మన్ పింగిలి రమేష్, పిఏసిఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, ముసిపట్ల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

- **అభివృద్ధి చేసేవారిని ఆశీర్వదించండి**

- బోయినిపల్లి మాధవి

వీర్నపల్లి: మారుమూల గ్రామాలను అభివృద్ధి చేసేవారిని ఆశీర్వదించాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్ కుమార్ సతీమణి బోయినిపల్లి మాధవి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు బావ్ సింగ్ నాయక్ తండా, భూక్య తండా, ఎర్రగడ్డ తండా, రంగంపేట గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో కలిసి ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎంపీగా వినోద్ కుమార్ మారుమూల వీర్నపల్లి అటవీ ప్రాంతాన్ని దత్తత తీసుకొని అభివృది చేశారన్నారు. అటవీ భూములను దున్నుకొని జీవించే రైతులకు హక్కులు కల్పించి పట్టాలు అందించారన్నారు. మారుమూల అటవీ ప్రాంతాల్లో వంతెన నిర్మాణాలు చేపట్టారన్నారు. కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ కాలయాపన చేస్తోందన్నారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, జడ్పీటీసీ గుగులోతు కళావతి, ఎంపీపీ మాలోతు భూల, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్, మహిళా మండల అధ్యక్షురాలు గుగులోతు కళ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మాధవి

వైభవంగా సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం



పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, ఏప్రిల్ 29: మండలంలోని అనంతపల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, వేములవాడ నియోజక వర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జీ చల్మెడ లక్ష్మీనరసింహారావు, జడ్పీటీసీ నాగం కుమార్, వేములవాడ సెస్ డైరెక్టర్ నామాల ఉమ, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేష్ పూజలు చేశారు. మాజీ ప్రజా ప్రతినిధులు లింగారెడ్డి, దేవేంద్ర-వెంకటేశం, ఐతం అంజయ్య, నాయకులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

వేములవాడ రూరల్, ఏప్రిల్ 29: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బండ మల్లేశం అధ్యక్షతన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బండ మల్లేశం మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు ఎక్కడున్నా ఉపయోగించుకోవాలన్నారు. గ్రామాలలో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని గ్రామాల ప్రత్యేక అధికారులుకు ఆదేశించారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీటీసీలకు సమాచారం అందించాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, వైస్ ఎంపీపీ జక్కుల కవిత, ఎంపీటీసీలు చెన్నాడి శ్యామల, వెలుమ నర్సవ్వ, బొడ్డు శంకరవ్వ, గ్రామాల ప్రత్యేక అధికారులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులకు మద్యం విక్రయిస్తే చర్యలు

వేములవాడ, ఏప్రిల్ 29: బెల్ట్ షాపులకు మద్యం విక్రయిస్తే చట్ట పరంగా చర్యలు తప్పవని వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వేముల వాడ సబ్ డివిజన్ పరిధిలోని పట్టణాలు, గ్రామాలలో ఉన్న బెల్ట్ షాప్‌లపై దాడులు నిర్వహించి 55 కేసులల్లో 3,12,374 రూపాయల విలువ గల 584 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు తెలిపారు.గతంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 68 కేసులల్లో 2,55,500 రూపాయలు విలువ గల 417 లీటర్ల మద్యం సీజ్ చేసి ఉక్కుపాదం మోపామన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లోని దుకాణాల్లో పర్మిషన్ లేకుండా బెల్ట్ షాప్ నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బెల్ట్ షాప్ నిర్వాహకులకు మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.


కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

రుద్రంగి ఏప్రిల్ 29: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని జడ్పీటీసీ గట్ల మీనయ్య అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రుద్రంగి మండల కేంద్రంలో సోమవారం ఆటవీ ప్రాంతంలోని ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్ద కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడూతూ కాంగ్రెస్ ఆధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధిహామీ కూలి రూ.400 పెంచనున్నట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గట్ల మీనయ్య, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, చెలుకల తిరుపతి, ఇప్ప మహేష్, తర్రె లింగం, గండి నారాయణ, పిడుగు లచ్చిరెడ్డి, దర్న మల్లేశం, స్వర్గం పరంధామ్, పల్లి గంగాధర్, సూర ఖాదయ్య, పూదరి మహిపాల్, ఇప్ప నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

వేములవాడ, ఏప్రిల్ 29:వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యా లయాన్ని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కరీంనగర్ డీఐజీ రవీం దర్ సోమవారం తనిఖీ చేశారు. రిజస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ల తాకిడి ఎక్కువగా ఉన్నందున సరైన స్థలం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున ప్రభుత్వ పరంగా ఖాళీగా ఉన్న భవనాల్లోకి మార్చాలని యోచిస్తున్నామన్నారు. సబ్‌రిజస్ట్రార్ సురేంద్ర బాబు ఉన్నారు.

కరీంనగర్ ఎంపీ బరిలో 28 మంది అభ్యర్థులు



కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 29: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి ఉప సంహరణల అనంతరం 28 మంది అభ్యర్థులు పోటి పడనున్నారు. సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ పమేలా సత్పతి అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు మినహా 24 మందికి గుర్తులు కేటాయిం చారు. మొదట 9 మంది రిజిస్టర్డ్ అన్ రికగ్నైజ్డ్ పొలిటికల్ పార్టీల అభ్యర్థులకు గుర్తులు కేటాయించి, అనంతరం 15 మంది స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయిం చారు. బీజేపీ అభ్యర్థిగా బండి సంజయ్ కుమార్ (కమలం), మారెపల్లి మొగిలయ్య బీఎస్‌పి (ఏనుగు), బోయినపల్లి వినోద్‌కు మార్ బీఆర్ఎస్ (కారు), వెలిచాల రాజేందర్‌రావు కాంగ్రెస్ (హస్తం), కడ్తాల అనిల్‌రెడ్డి నేషనల్ నవ క్రాంతి పార్టీ (తోపుడుబండి), తాళ్లపల్లి అరుణ అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ (చపాతి రోలరు) , పంచిక అశోక్ సోస ల్ జస్టిస్‌పార్టీ ఆఫ్ ఇండియా (పౌరులు), చింత అనిల్‌కుమార్ పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా (పిల్లనగ్రోవి), చిలువేరు శ్రీకాంత్ ధర్మసమాజ్‌పార్టీ (చెప్పులు), చీకోటి వరుణ్‌కుమార్ గుప్తా తెలుగు కాంగ్రెస్ పార్టీ (బ్యాట్), పోడిశెట్టి సమ్మయ్య బహుజన్ ముక్తి పార్టీ (మంచం), రాణాప్రతాప్ గట్టు సోషలిస్ట్ పార్టీ (ఇండియా) (చెఱకు రైతు), పెద్దపల్లి శ్రావణ్ భారతీయ యువకుల దళం (స్విచ్‌బోర్డు), మిగతా వారంతా స్వతంత్ర అభ్యర్థులు అబ్బాడి బుచ్చిరెడ్డి (రోడ్ రోలర్), అక్షయ్‌కుమార్ మేకల (టేబుల్), ఎనోస్ కట్కూరి (వజ్రం), కోట శ్యాంకుమార్ (కెమెరా), గట్టయ్య యాదవ్ బరిగె (గ్యాస్ పొయ్యి), గద్ద సతీష్ (పల్లకి), గవ్వల లక్ష్మి (గ్యాస్ సిలిండర్), గుడిసె మోహన్ (కంప్యూటర్), దేవ నూరి శ్రీనివాస్ (విజిల్), మానస పేరాల (ల్యాప్‌ట్యాప్), రాజేందర్ పొత్తూరి (గాజుగ్లాసు), రాపోల్ రామ్‌కుమార్ భర ద్వాజ్ (బెలూన్), జర్నలిస్ట్ విక్రమ్‌రెడ్డి వేముల (క్యాలీఫ్లవర్), వెంకటనర్సయ్య డేగల (టార్చిలైట్), శివరాత్రి శ్రీనివాస్ (ఎయిర్ కండిషనర్)లకు గుర్తులను కేటాయించారు.

లక్ష్యం మేరకు సీఎంఆర్ ఇవ్వాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 29: నిర్దేశించిన లక్ష్యం మేరకు సీఎం ఆర్ ఇవ్వాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. 2023-24 ఖరీఫ్ సీఎంఆర్ ఎఫ్‌సీ ఐకి ఇవ్వడంపై జిల్లాలోని 68 రా రైస్ మిల్లుల యజమానులతో కలెక్టరేట్‌లో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డారు. 2023-24 ఖరీఫ్ సీజన్‌లో ఆయా రా రైస్ మిల్లులకు కలిపి మొత్తం 1,44,571 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇచ్చామని, 96,690 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాల్సి ఉందని వెల్లడించారు. ఎఫ్‌సీఐ నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణా లతో సీఎంఆర్ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇప్పటి దాకా సీఎంఆర్ ఇవ్వని రైస్ మిల్లుల జాబితా తయారు చేయాలని సూచించారు. వారం తరువాత కూడా సీఎంఆర్ ఇవ్వకపోతే వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం రైస్ మిల్లర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

సిరిసిల్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వడగాలులు, ఎండ తీవ్రతతో జిల్లా ప్రజలు మాడిపోతున్నారు. వారం రోజులుగా జిల్లాలో గరిష్ఠస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం కూడా జిల్లా ఆరెంజ్ అలర్ట్‌లోనే కొనసాగింది. జిల్లాలో కనిష్ఠ ఉష్ణో గ్రత 25.7, గరిష్ఠ ఉష్ణోగ్రత 43.7 డిగ్రీలుగా నమోదైంది. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలవడంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి జనం జంకుతున్నారు. సాయ త్రంం 6.30 గంటల వరకు కూడా ఎండ తీవ్రత తగ్గడం లేదు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

8న వేములవాడకు ప్రధాని రాక

వేములవాడ, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 8వ తేదీ బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ వేములవాడలో పర్యటించనున్నారు. వేములవాడకు చేరుకో గానే తొలుత రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుంటారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామ కృష్ణ తెలిపారు. అనం తరం ఉదయం 11 గంటలకు ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రధాని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వేముల వాడ, నాంపల్లి, కొండగట్టు, ధర్మపురి దేవాలయాలను టెంపుల్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేయనున్నట్లు హామీ ఇచ్చే అవకాశం ఉందని బీజేపీ నాయకులు వెల్లడించారు.

మార్కెట్‌కు అనుగుణంగా వస్త్రాలను తయారు చేయాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 29: ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వస్త్రాలను సిరిసిల్లలో తయారు చేస్తే వ్యాపారులు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని హైదరాబాద్‌లోని పత్తర్‌ఘట్ వస్త్ర వ్యాపారులు కోరిన విధంగా వస్త్రాలను శాంపిల్‌గా తయారు చేసి పంపించాలని చేనేత జౌళి శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం కోరారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ శివాలయం కల్యాణ మండపంలో సోమవారం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై హైదరాబాద్ వస్త్రవ్యాపారులతో ఆసాములు, యజమానుల మధ్య బయ్యర్స్ సేలర్స్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హైదరాబాద్‌కు చెందిన పది మంది వ్యాపారులు హాజరయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్, బెంగుళూరులలో డిమాండ్ ఉన్న వస్త్రాన్ని సిరిసిల్లలో నాణ్యతా ప్రమాణాలతో తయారు చేస్తే తాము కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యాపారులు వివరించారు. మార్కెట్‌లో ప్రస్తుతం డిమాండ్ ఉన్న కొన్ని వస్త్రాలను శాంపిల్‌గా తయారు చేసి తమకు పంపిస్తే వాటి తయారీ అనుగుణంగా ఆర్డర్లను అందించి కొనుగోలు చేస్తామని వ్యాపారులు కోరారు. అనంతరం జరిగిన సమావేశంలో వెంకటేశం మాట్లాడుతూ వ్యాపారులు కోరిన విధంగా వస్త్రాలను తయారు చేసేందుకు ఆసాములు, యజమానులు ముందుకు వచ్చి ఆర్డర్లను తీసుకోవాలని, ఉపాధిని పొందాలని సూచించారు. ఈ సమావేశంలో వరంగల్ ఆర్‌డీడీ అశోక్‌రావు, ఏడీ సాగర్, యజమానులు, ఆసాములు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం

ఓటు హక్కు వినియోగించుకోవాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 29 : ఓటు హక్కును ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని ఆర్డీవో శేషాద్రి అన్నారు. సోమవారం వేములవాడ మండల కేంద్రంలోని సమాఖ్య భవనంలో, మండలంలోని రుద్రవరం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 'ఐ ఓటు ఫర్ ష్యూర్.. ఓటు హక్కు నా బాధ్యత' అనే అంశంపై మండల సమాఖ్య బాధ్యులు, వీవో ప్రెసిడెంట్లు, వీవోఏలకు అవగాహన కల్పించా మన్నారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేయించామన్నారు. ఈ కార్యమ్రంలో స్వీప్ నోడల్ అధికారి, అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

వీణవంక, ఏప్రిల్ 29: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులోని ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని పశుగ్రాసం కాలిపోయింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలానికి చెందిన రవీందర్ బ్రాహ్మణపల్లిలో గడ్డి కొనుగోలు చేసి సోమవారం వ్యాన్(టీఎస్12 యూడీ 1470)లో తీసుకెళుతున్నాడు. గ్రామ శివారు నుంచి వ్యాన్ వెళ్తుండగా విద్యుత్ తీగలు గడ్డికి తగిలాయి. రాపిడికి మంటలు లేచి అంటుకున్నాయి. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది అక్కడికి చేరుకునే సరికి గడ్డి మొత్తం కాలిపోయింది. వ్యాన్‌సైతం 70శాతం కాలిపోయింది.

తనిఖీల్లో మద్యం పట్టివేత

ఇల్లందకుంట, ఏప్రిల్ 29: మండలంలోని మల్యాల గ్రామ శివారులో పోలీసులు సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టిబడింది. హనుమకొండ జిల్లా నడికూడ మండలానికి చెందిన పామెర రమేశ్ అనే వ్యక్తి మోటర్ సైకిల్‌పై రూ. 9,500 విలువ గల మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన వ్యాన్



ధ్వంసమైన డివైడర్

కోరుట్ల, ఏప్రిల్ 29: పట్టణంలోని జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ కోసం ఏర్పాటు చేసిన డివైడర్‌ను సోమవారం వేకువజామున వ్యాన్ ఢీకొట్టింది. దీంతో సెంట్రల్ లైటింగ్ కోసం ఏర్పాటు చేసి గోడ పూర్తిగా దెబ్బతిని దానికి అనుకొని ఉన్న విద్యుత్ స్తంభం కొంత మేర రోడ్డుకు ఒక వైపు ఒరిగింది. ప్రమాద సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మున్సిపల్ ఏఈ లక్ష్మి సంబధింత విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ కిరణ్ కుమార్ పరిశీంచి విచారణ చేపట్టారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నాలుగు రోజులు జైలు శిక్ష

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 29: అతిగా మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడ్డ కేసులో ఒకరికి జగిత్యాల కోర్టు న్యాయమూర్తి నాలుగు రోజుల జైలు శిక్ష విధించారు. జిల్లాలోని గొల్లపల్లి మండలం ఇస్రాజ్‌పల్లికి చెందిన తుమ్మ మధుకర్ అనే వ్యక్తి మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనం నడుపుతూ ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రంకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నాలుగు రోజుల జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడప వద్దని కోరారు. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ



క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

- కిటకిటలాడిన ఆలయ పరిసరాలు
- బద్దిపోచమ్మకు మొక్కు చెల్లింపు

వేములవాడ, ఏప్రిల్ 29: ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం సోమవారం నాడు భక్తులతో రద్దీగా మారింది. ఇష్టదైవమైన రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో వేములవాడ పుణ్యక్షేత్రం కిటకిట లాడింది. ఈ సందర్భంగా వారు తొలుత ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుం డంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని తరించారు. సోమవారం సందర్భంగా ఆలయ అధికారులు లఘు దర్శనం అమలు చేయడంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్య లో భక్తులు చెల్లించుకున్నారు. కళాభవన్‌లో స్వామి వారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం, భీమేశ్వరాలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయాయి. పెద్దసంఖ్యలో భక్తులు బద్దిపోచమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కంప్యూటర్ వర్క్‌పేరిట సైబర్ మోసాలు

- కంబోడియాలో నరకయాతన అనుభవించిన బాధితుడు - ఇంటికి చేర్చిన పోలీసులు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 29: 'కంప్యూటర్ వర్క్ పేరిట సైబర్ మోసాలకు సంబంధించిన కాల్స్ చేయించారు. ప్రతీ రోజు 16గంటలు పనిచేయించారు. ఇంటికి వెళ్తానంటే పాస్‌పోర్ట్ ఇవ్వలేదు. కంబోడియాలో నరకయాతన అనుభవించాను' అని సిరిసిల్ల పట్టణం పెద్దూరు గ్రామానికి చెందిన బాధితుడు అతికం శివప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశాడు. సిరిసిల్ల పట్టణం పెద్దూరుకు చెందిన అతికం లక్ష్మీ తన కుమారుడు శివప్రసాద్ కంబోడియాలో ఇబ్బందులు పడుతున్నాడని గ్రీవెన్స్ డేలో ఫిర్యాదు చేయడంతో ఎస్పీ అఖిల్ మహాజన్ చొరవ తీసుకున్నారు. కంబోడియాలో సైబర్ మూఠా చెరలో చిక్కుకున్నట్లు తెలుసుకున్న పోలీసుల కృషి ఫలితంగా శివప్రసాద్ ఆదివారం రాత్రి క్షేమంగా ఇంటికి చేరుకున్నాడు. కంబోడియాలో పడిన ఇబ్బందులపై సోమవారం ఓ వీడియో విడుదల చేశాడు. ముందుగా తన విడుదలకు కృషి చేసిన ఎస్పీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. అనంతరం తన ఆవేదనను చెప్పుకొచ్చాడు. ఉద్యోగ అన్వేషణలో భాగంగా విదేశాలకు వెళ్లాలనుకున్న తాను కొడిమ్యాలకు చెందిన ఏజెంట్‌ను కలిశానని, కంబోడియాలో కంప్యూటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి చైనీస్ కంపెనీ పేరిట ఉన్న కాల్ సెంటర్‌లో పెట్టించాడని పేర్కొన్నాడు. అక్కడ సైబర్ మోసాలకు పాల్పడే పనులు చేయించారని చెప్పాడు. కంబోడియాలో వందలాది మంది యువకులు తనలాగే నరకం అనుభవిస్తున్నారని, ఇలాంటి బాధలు ఎవరికీ రావద్దని ఆవేదన వ్యక్తం చేశాడు. నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు విదేశాలకు వెళ్లేవారు అనుమతి ఉన్న ఏజెన్సీలను ఆశ్రయించాలని కోరాడు.

చికిత్స పొందుతూ మాజీ సర్పంచ్ మృతి

చందుర్తి ఏప్రిల్ 29: రోడ్డు ప్రమాదంలో గాయపడిన చందుర్తి మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ మర్రి మల్లేశం (55) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ మల్లేశం ఆదివారం చందుర్తి నుంచి మోత్కరావుపేటకు తన ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్తున్నాడు. చందుర్తి శివారులోని రైతు వేదిక వద్ద రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పల వద్ద రోడ్డుపై అడ్డుగా పెట్టిన బండరాళ్లను తప్పించబోయాడు. దీంతో ట్రాక్టర్ ధాన్యం కుప్పల పైకి దూసుకెళ్లి బోల్తా పడింది. డ్రైవింగ్ చేస్తున్న మల్లేశంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ప్రవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మల్లేశం మృతిపై ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సాను భూతిని తెలిపారు.

ఆస్తి కోసం తండ్రిపై తనయుడు దాడి

మల్లాపూర్, ఏప్రిల్ 29: మండలంలోని అడవి రేగుంట గ్రామానికి చెందిన రాజారెడ్డిపై ఆస్తి పంపకాలు చేయాలని తనయుడు శేఖర్ సోమవారం దాడికి పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన రాజారెడ్డితో ఆస్తి పంచి ఇవ్వాలని కొంత కాలం నుంచి కొడుకు శేఖర్ గొడవ పడుతున్నాడు. సోమవారం ఆస్తి విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో రాజారెడ్డి తన భూమికి చెందిన పట్టా పాస్ బుక్కును తీసుకొని బ్యాంకుకు వెళ్లేందుకు గ్రామంలోని బస్టాండుకు చేరుకున్నాడు. బస్టాండ్‌లో ఉన్న రాజారెడ్డిని గమనించిన శేఖర్ పారాతో తలపై దాడి చేశాడు. దీంతో రాజారెడ్డి తీవ్ర రక్తస్రావంతో కిందపడిపోయాడు. స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జానపద కళలకు పుట్టినిల్లు భారతదేశం



కళాకారులను సన్మానిస్తున్న వీసీ సంకసాల మల్లేష్

గణేశ్‌నగర్, ఏప్రిల్ 29: జానపద కళలకు పుట్టినిల్లు భారతదేశం అని శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య సంకసాల మల్లేష్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా లీడ్ ఇండియా నేషనల్ క్లబ్, తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘ అధ్యక్షుడు లయన్ కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో వీసీ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలల్లో ఆసక్తి కలిగిన పిల్లలకు, యువతీ యువకులకు మన శాస్త్రీయ కళలను నేర్పించడానికి సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. సభాధ్యక్షులు లయన్ కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశ కళలను భవిష్యత్తు తరాలకు అందించాలని సూచించారు. పాశ్చాత్య కళలకు ఆకర్షితులవుతున్న నేటి యువత మన కళా వైభవాలను మరిచి పోవడం బాధాకరమన్నారు. ప్రముఖ శాస్త్రీయ నృత్య కళాకారులు, డ్యాన్స్ మాస్టర్ రతన్ కుమార్ మాట్లడుతూ వారానికి లేదా పక్షానికి ఒక రోజు కరీంనగర్‌లో మన తెలంగాణ పేరిణి శివతాండవం, పేరిణి లాస్య శిక్షణా తరగతులను ఉచితంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఆసక్తి గల యువత నాట్యాన్ని నేర్చుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ప్రముఖ నృత్య కళాకారులు ఇంజనీరు రతన్ కుమార్, నంది పురస్కార గ్రహీత, గిన్నీస్ రికార్డు హోల్డర్ శాస్త్రీయ నర్తకి కుమారి స్నేహితలను ఆచార్య మల్లేష్, కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డిలు ఘనంగా సన్మానించారు.

తప్పుడు ధ్రువపత్రాలతో భూ కబ్జాకు యత్నం

చొప్పదండి, ఏప్రిల్ 29: తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని కబ్జా చేసేందుకు యత్ని స్తున్న వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండిలోని సర్వే నంబరు 439, 440, 441 లో సుద్దాల వెంకటస్వామి అనే వ్యక్తి రెండు గుంటల భూమిని కొనుగోలు చేశాడు. అనంతరం వెంకటస్వామి మహేందర్‌రెడ్డి అనే వ్యక్తికి విక్రయించాడు. అనంతరం పలువురు కొనుగోలు, అమ్మకాలు జరిపారు. కొంత కాలం తరువా త ఆ భూమిని చొప్పదండికి చెందిన కృష్ణహరి కొనుగోలు చేశాడు. కాగా సుద్దాల వెంకటస్వామి ఆ భూమి తనదేనని తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ఇంటి నిర్మాణానికి పర్మిషన్ పొందాడు. అనంతరం తనను మోకపైకి రానివ్వకుండా వెంకటస్వామి బెదిరి స్తున్నాడని కృష్ణహరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దీనిపై విచారణ జరిపి సుద్దాల వెంకటస్వామి, అతడి భార్య తరుణిపై కృష్ణహరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వెంకటస్వామి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

జగిత్యాలలో ఏసీబీకి చిక్కిన హెడ్‌కానిస్టేబుల్



పట్టుబడ్డ హెడ్‌కానిస్టేబుల్ మనోహర్

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 29: జగిత్యాల జిల్లాలోని బీర్‌పూర్ పోలీ స్స్టేషన్‌లో హెడ్‌కాని స్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సామిల్ల మనోహర్ రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా సోమవారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల మం డలం పెరుకపల్లి గ్రామానికి చెందిన బాల తిరుపతి నాలుగు నెలల క్రితం దుబాయ్ వెళ్లాడు. దుబాయ్ వెళ్లకంటే ముందు ఓ భూవివాదం కేసులో నేరస్థుడుగా ఉన్నాడు. ఈ కేసు విషయంలో తిరుపతిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీకాగా కోర్టుకు గైర్హాజరయ్యాడు. ఈ కేసు విషయమై బాధితుడు తిరుపతి మామ కట్కం గంగాధర్ దగ్గర రూ.5 వేలు డిమాండ్ చేయగా ఈ నెల 16వ తేదీన గూగుల్‌పేద్వారా రూ. 5 వేలు రూపాయలను హెడ్‌కానిస్టేబుల్ మనోహర్ కు పంపించాడు. ఇవే కాకుండా మరో రూ.5 వేలు అదనంగా లంచం కావాలని హెడ్‌కానిస్టేబుల్ బాధితుడి మామ కట్కం గంగాధర్‌ను బలవంతం చేశాడు. దీంతో దుబాయ్ నుంచి బాధితుడు తిరుపతి ఏసీబీ డీజీపీకి మెయిల్ ద్వారా హెడ్‌కాని స్టేబుల్‌పై ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో జగిత్యాల మండలం లోని పెరుకపల్లి రాజీవ్‌చౌరస్తా వద్ద బాధితుడు తిరుపతి మామ కట్కం గంగాధర్ వద్ద నుంచి హెడ్‌కానిస్టేబుల్ మనోహర్ రూ. 5 వేలు లంచం తీసుకుం టుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. అనంతరం కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు క్రిష్ణకుమార్, తిరుపతి సిబ్బంది పాల్గొన్నారు.

సెమీఫైనల్స్‌కు చేరిన ఫుట్‌బాల్ పోటీలు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 29: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. వనపర్తి, ఆదిలాబాద్, కరీంనగర్, రంగారెడ్డి జట్లు సెమిఫైనల్స్‌కు చేరుకున్నాయి. వనపర్తి, నల్గొండ జట్ల మధ్య జరిగిన పోటీలో వనపర్తి జట్టు, రంగారెడ్డి, వరంగల్ జట్ల మధ్య జరిగిన పోటీలో రంగారెడ్డి, రంగారెడ్డి, కరీంనగర్ జట్ల మధ్య జరిగిన పోటీలో కరీంనగర్ జట్టు విజయం సాధించి సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. మంగళవారం ఉదయం సెమీఫైనల్స్ పోటీలు అనంతరం సాయంత్రం ఫైనల్ మ్యాచ్ జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గణపతి, వైస్‌ప్రెసిడెంట్ నాయుడు, కోశాధికారి సామల సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ విజయ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నరేష్ పాల్గొన్నారు.



మ్యాచ్ ఆడుతున్న వనపర్తి, నల్గొండ జట్లు

చరిత్ర పరిశోధకుడు శ్రీనివాసరాజు మృతి



శ్రీనివాసరాజు(ఫైల్)

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 29: కరీంనగర్‌లో నివాసముంటున్న రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వేంకట్రావుపల్లి గ్రామానికి చెందిన చరిత్ర పరిశోధకుడు, రచయిత, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నమాధవుని శ్రీనివాసరాజు(61) శనివారం మధ్యాహ్నం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం ఆయన అంత్యక్రియలు స్వగ్రామంలో పూర్తయ్యాయి. శ్రీనివాసరాజుకు భార్య విజయలక్ష్మి, కుమారులు కీర్తిచంద్ర, శ్రీచైతన్య ఉన్నారు. విద్యాశాఖ కార్యాలయంలో టైపిస్ట్‌గా చేరిన ఆయన కరీంనగర్, పెద్దపల్లి, చొప్పదండి, కాటారం ప్రభుత్వ కళాశాలల్లో ఉపన్యాసకునిగా, ప్రాచా ర్యునిగా పనిచేస్తూ చొప్పదండిలో 2020లో పదవీ విరమణ పొందారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ తీసుకున్నారు. ప్రిన్సెస్ యశోధర చారిత్రక నాటకం, ముస్నూరి కాపయనాయకుడు చారిత్రక పరిశోధక నవల, భరతావని చారిత్రక కావ్యం, బహద్దూర్ కొండాలరాయుడు చారిత్రక నవల, బొమ్మలమ్మగుట్ట చక్రేశ్వరీదేవి శతకం, హిస్టరీ ఆఫ్ డస్టెన్స్ ఎడ్యుకేషన్, మానవ జీవన సంరక్షణ కవితలు, భగవద్గీత-సోపానములు (అనువాదం) వంటి పుస్తకాలను రచించారు. శ్రీనివాసరాజు మృతి పట్ల ఉమ్మడి జిల్లాకు చెందిన కవులు, రచయితలు సంతాపం వ్యక్తం చేశారు.

ఆర్జిత సేవల బుకింగ్ క్లర్క్‌పై దాడికి యత్నం

వేములవాడ, ఏప్రిల్ 29: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి దేవాలయంలో ఆర్జితసేవల బుకింగ్ కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న క్లర్క్‌పై భక్తులు దాడికి యత్నించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. రాజన్న ఆలయంలో భక్తులు నిర్వహించే ఆర్జిత సేవలలో భాగంగా నిత్యం స్వామివారి నిత్య కల్యాణం జరిపిస్తుంటారు. ఆలయం తూర్పు భాగంలో ఉన్న కళాభవన్‌లో నిర్వహించే స్వామివారి నిత్యకల్యాణం కోసం భక్తులకు రోజూ గరిష్ఠంగా 150 నుంచి 160 టికెట్ల వరకు విక్రయిస్తారు. ఒక టికెట్‌పై ఒక జంటను లేదా ఇద్దరిని అనుమతిస్తారు. రద్దీ తక్కువగా ఉన్న రోజుల్లో టికెట్లు కొనుగోలు చేసిన వారి కుటుంబ సభ్యులను కూడా అనుమతిస్తారు. సోమవారం భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో 157 టికెట్లు జారీ చేశారు. వీటికి నాలుగు శాశ్వత కల్యాణం టికెట్లు తోడు కావడంతో మొత్తం టికెట్ల సంఖ్య 161కి చేరింది. దీంతో స్వామివారి నిత్య కల్యాణం టికెట్లు నిలిపివేశారు. అప్పటికే చాలాసేపటి నుంచి స్వామివారి నిత్య కల్యాణం టికెట్ల కోసం క్యూ లైన్‌లో నిరీక్షిస్తున్న భక్తులు వాగ్వాదానికి దిగి ఆగ్రహానికి లోనయ్యారు. ఈ క్రమంలో బుకింగ్ కౌంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఓ మహిళా ఉద్యోగిపై దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న ఆలయ అధికారులు అక్కడికి చేరుకుని భక్తులను శాంతింపజేశారు. స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారా యణ వ్రతం తదితర ఆర్జిత సేవల టికెట్ల జారీ విషయంలో భక్తులకు తగిన సమాచారం ఎప్పటికప్పుడు అందించకపోవడంతో తరచూ భక్తులు గొడవ దిగుతున్నారని ఆలయ సిబ్బంది వాపోయారు. ఆర్జిత సేవల టికెట్ల జారీకి సంబంధించిన ఒక నిర్దిష్టమైన విధానాన్ని రూపొందించి అమలు చేయాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 29: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,450 రూపాయలు పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 23మంది రైతులు 311క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు మూడు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,450, కనిష్ఠ ధర .5వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

తప్పిపోయిన మహిళను కుటుంబానికి అప్పగించిన పోలీసులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 29: ఎనిమిదేళ్ల క్రితం తప్పిపోయిన దోమల రాములమ్మను గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని గాలిపెల్లి గ్రామానికి ఆదివారం రాత్రి గుర్తుతెలియని మహిళ వచ్చిందనే సమాచారంతో పోలీసులు వెళ్లారు. విచారించగా తనపేరు రాములమ్మ అని తెలిపింది. దీంతో పోలీసులు సిరిసిల్లలోని సఖిసెంటర్‌కు పంపించారు. సోమవారం మహిళకు సంబంధించిన వివరాలు సేకరించగా ఖమ్మం జిల్లావాసిగా గుర్తించారు. ఖమ్మం జిల్లా ముదిగొండ పోలీసులు సమాచారం ఇవ్వగా వారు కిష్టాపూర్ గ్రామపెద్దలకు విషయం చెప్పారు. దీంతో రాములమ్మ కుమార్తె రమాదేవి సిరిసిల్లకు చేరుకుంది. తన తల్లి ఎనిమిది సంవత్సరాల క్రితం ఇంటి నుంచి వెళ్లిందని, మతిస్థిమితం సరిగా ఉండదని తెలిపింది. తప్పిపోయిన తన తల్లిని అప్పగించినందుకు ఎస్సై, సఖిసెంటర్ నిర్వాహకులకు కృతజ్ఞతలు చెప్పింది.

విద్యార్థుల కోసం టెలీమానస్ ఏర్పాటు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 29: పదో తరగతి(ఎస్ఎస్‌సీ) పరీక్షా ఫలితాలు వెలువడుతున్న దృష్ట్యా ఫెయిల్ అయిన విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోను కాకుండా ఉండేందుకు టెలీమానస్ పేరుతో టోల్ ఫ్రీ నంబరు 14416 ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు మనోధైర్యం కోల్పోకూడదని, తిరిగి పరీక్ష రాసి పాసయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడకూడదని, ఒత్తిడి జయించాలని సూచించారు. మానసిక ఒత్తిడికి గురైన విద్యార్థులు వైద్యుల సలహాలు సూచనలకు టోల్ ఫ్రీ నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

ఇల్లందకుంట, ఏప్రిల్ 29: మండల కేంద్రంలో అనుమతులు లేకుండా వెంచర్ చేసి సీసీ రోడ్డు వేసిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

వృద్ధాశ్రమం సందర్శించిన జడ్జి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 29: నగరంలోని ప్రభుత్వ వృద్ధాశ్రమం, స్వధార్ హోమ్, బాలసదన్, శిశు గృహాలను సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె వెంకటేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యవ్వనంలో ఆకర్షణకులోనై దానిని ప్రేమగా భావించి కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేసి బంగారు భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. కష్టపడి చదువుకొని జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత ప్రేమ గురించి ఆలోచించాలని చెప్పారు. అప్పటి వరకు చదువుపై శ్రద్ధవహించాలని కోరారు. బాల్యం నుంచే మంచి నడవడికను అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బాలసదన్ పిల్లలకు సూచించారు. పాఠశాల నుండి వచ్చిన వెంటనే పరిశుభ్రతను పాటించాలని అన్నారు. శిశు గృహం పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని, పిల్లలకు ఏదైనా అనారోగ్య సమస్య వస్తే వెంటనే వారిని ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స చేయించాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ తనుకు మహేశ్, వృద్ధాశ్రమం, స్వాధార్ హోం, బాలసదన్ నిర్వహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం ఉధృతం చేయాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 29: బీజేపీ అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం రైల్వేస్టేషన్ వద్ద హమాలీ సంఘం కార్యాలయంలో మేడే పోస్టర్‌ను అవిష్కరించారు. కార్యక్రమంలో కాసెట్టి లక్ష్మయ్య, గాండ్ల రమేష్, దాసరిప్రభాకర్, గండు మహేందర్, ఐతము రఘుపతి, జెట్టి రాజు, బొడ్డు శంకరయ్య, గాండ్ల రవీందర్, తంగెళ్లపల్లి రాజు, కాసెట్టి శ్రీనివాస్, తంగెళ్లపల్లి స్వామి,తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు



రైతులతో మాట్లాడుతున్న ఏఎస్సై శ్రీనివాస్ రెడ్డి

కోనరావుపేట ఏప్రిల్ 29: ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే పోసుకోవాలని, రోడ్లపై పోస్తే చర్యలు తీసుకుంటామని కోనరావుపేట ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిమ్మపెల్లి కొండాపూర్ గ్రామాల్లో రోడ్లపై ధాన్యం పోసిన రైతులతో మాట్లాడారు. రోడ్లపై ధాన్యం పోయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురై మృతి చెందుతున్నారన్నారు.ఇటీవల ఎల్లారెడ్డిపేట మండలంలో ఓ వాహన దారుడు ధాన్యం కుప్పను ఢీకొని మృతి చెందాడని, ఆ రైతుపై కేసు నమోదైందని తెలిపారు. కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు.

రాజన్న కోడెలకు పశుగ్రాసం వితరణ

వేములవాడ టౌన్, ఏప్రిల్ 29: వేములవాడ రాజరాజేశ్వరస్వామి గోశాలకు భక్తులు సోమవారం 6,500 కేజీల ఎండు గడ్డిని ఉచితంగా అందజేసినట్లు ఆలయాధికారులు తెలిపారు. దత్తపేట గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి 500 కేజీలు, పెద్దూర్‌కు చెందిన వెంకటేష్ 1000, దమ్మక్కపేటకు చెందిన గంగాధర్ 1000, దత్తరాజుపల్లికి చెందిన పొన్నం రాజేశం 1800, వట్టిచర్లకు చెందిన రాజయ్య 1200, నందగిరికి చెందిన రిషిక్ 1000 కేజీల ఎండుగడ్డి కట్టలను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. రాజన్న కోడెలకుఎండుగడ్డి కట్టలను అందజేయాలనుకునే భక్తులు నాంపల్లిలో ఏర్పాటు చేసిన మూడో గోశాలకు గడ్డిని తీసుకురావాలని ఆలయ అధికారులు విజ్ఞప్తి చేశారు.

బ్యాంకు మిత్రపై ఫిర్యాదు

కోనరావుపేట, ఏప్రిల్ 29 : మండలంలోని కనగర్తికి చెందిన బ్యాంకు మిత్ర తడక వసంతపై బ్యాంకు లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు కనగర్తి బ్యాంక్ ఆఫ్ బరోడా కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు ఖాతాదారులు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కనగర్తికి చెందిన వసంత ఖాతాదారుల వేలిముద్రలు తీసుకొని వారి డబ్బులను డ్రా చేసి వాడుకుంటోందని, ఖాతాదారులకు ఇవ్వడం లేదని అన్నారు. ఆమెపై చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ ఉపసర్పంచ్ వంగపల్లి దేవరాజు, బీజేపీ నాయకుడు లచ్చిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పుట్ట గోపాల్ రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ అనుపాటి బాబు రెడ్డి, కరీంనగర్ డెయిరీ చైర్మన్ లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పులి వెంకటి, తిరుపతి తదితరులు ఉన్నారు.

లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 29: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిష్టంపల్లిలో నెలకొన్న ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని మాజీ ఎంపీటీసీ బాలరాజుయాదవ్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సెస్ సేవా సదనంలో సోమవారం సెస్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలరాజుయాదవ్ మాట్లాడుతూ ఓల్టేజీ కరెంటు సమస్యతో గ్రామంలో విద్యుత్ పరికరాలు కాలిపోతున్నాయన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకుండాపోయిందన్నారు. అధికారులు పట్టించుకోవాలని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

బీఆర్ఎస్, బీజేపీ చీకటి దోస్తులు

గంభీరావుపేట, ఏప్రిల్ 30 : బీఎస్ఎస్, బీజేపీ చీకటి దోస్తులని సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ గల్లీలో కుస్తీ పడుతూ ఢిల్లీలో దోస్తీ చేస్తున్నాయని అన్నారు.

మే డే వేడుకలను ఘనంగా నిర్వహించాలి

కోనరావుపేట, ఏప్రిల్ 29 : మే డే వేడుకలను కార్మికులు ఘనంగా నిర్వహించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. కోనరావుపేట మండల కేంద్రంలో సోమవారం భవన కార్మికులతో కలిసి మే డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉన్నప్పుడే మన హక్కులను సాధించుకోవచ్చన్నారు. మే డే వేడుకల్లో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, బాబు, చంద్రయ్య, ఆనంద్, రవి, దేవయ్య, గంగారాం, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతను కాపాడేది కాంగ్రెస్సే

గంభీరావుపేట, ఏప్రిల్ 30: దేశ సమగ్రతను కాపాడేది కాంగ్రెస్ మాత్రమేనని ఆ పార్టీ కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. గంభీరావుపేటలో సోమవారం మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జీఎస్టీని తగ్గిస్తామని, సామాన్యులకు నిత్యావసర వస్తువులను అందుబాటులోకి తెస్తామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దోచుకున్న ప్రతి పైసా కక్కిస్తామన్నారు.

కాంగ్రెస్ సభలో కనిపించని కటకం

గంభీరావుపేట, ఏప్రిల్ 30 గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ప్రచార సభలో ఆ పార్టీ రాష్ట్ర సీనియర్ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం కనిపించకపోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు తరఫున ఎన్నికల ప్రచారంలో భాగంగా గాంధీ చౌక్ వద్ద బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పార్టీ ముఖ్య నేతలు హాజరయ్యారు. సొంత గ్రామంలో జరిగిన సభకు మృత్యుంజయం హాజరు కాకపోవడం చర్చకు దారి తీసింది.

కుక్కల దాడిలో గొర్రెల మృత్యువాత

ముస్తాబాద్, ఏప్రిల్ 29 : మండలంలోని పోతుగల్‌లో సోమవారం కుక్కల దాడిలో గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామంలో కుంట భాస్కర్‌కు చెందిన గొర్రెల పాకపై ఆదివారం అర్ధరాత్రి దాటాక కుక్కలు దాడి చేశాయి. 15 గొర్రెలను కొరికి చంపాయి. దాదాపు రూ.1.50లక్షల నష్టం జరిగిందని బాధిత గొర్రెల కాపరి భాస్కర్ చెప్పాడు. రెండు నెలల్లో కుక్కలు గొర్రెల మందపై దాడి చేయడం మూడో సారి అని కుక్కల దాడి నుండి కాపాడాలని గొర్రెల కాపరులు వేడుకుంటున్నారు. బాధితులను ఆదుకోవాలని మాజీసర్పంచ్ తన్నీరు గౌతంరావు, మాజీ ఉపసర్పంచ్ రమేశ్ అధికారులను కోరారు.

కార్నర్ మీటింగ్‌ను విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 29:మండల కేంద్రంలో మే 1న నిర్వహించనున్న కాంగ్రెస్‌కార్నర్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి జన సమీకరణ చేయాలన్నారు.



- వాయిస్ కాల్ ప్రచారాలు
- భానుడి ప్రతాపంతో సెల్‌ఫోన్‌ల తోనే అభ్యర్థనలు
- టెక్నాలజీ ట్రెండ్‌ను వాడుకుంటున్న అభ్యర్థులు
- సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో చురుకుగా సోషల్ మీడియా కమిటీలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆయా పార్టీలు సోషల్ మీడియాలో దూకుడు పెంచాయి. భగ్గుమంటున్న ఎండలతో ఇంటి పట్టునే ఉంటూ అధునిక సాంకేతికత ఉపయోగించుకుంటున్నాయి. తమదైన శైలిలో కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో సోషల్ మీడియాలో చురుకుగా వ్యవహరిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో కొత్త ట్రెండ్‌గా సోషల్ మీడియా పని చేస్తోంది. జిల్లాలోని రెండు సెగ్మెంట్ల పరిధిలో 4.72 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ప్రతి ఇంటిలోనూ సెల్‌ఫోన్‌ల వినియోగం కనిపిస్తోంది. ప్రతీ ఓటరు చేతిలోనూ స్మార్ట్ ఫోన్ ఉండడంతో ఎన్నికల ప్రచారాన్ని రకరకాల సోషల్‌మీడియా యాప్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఇందుకోసం బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ సోషల్ మీడియా ప్రభావాన్ని గుర్తించి ప్రత్యేకంగా కమిటీలను నియమించాయి. ప్రతీ మండలం నుంచి గ్రామస్థాయిలో సోషల్ మీడియా కమిటీలు పని చేస్తున్నాయి. సోషల్ మీడియా కమిటీల్లో యువతను ప్రధానంగా ఉపయోగించుకోవడంతోపాటు ఏ చిన్న కార్యక్రమమైనా పోస్టులు పెడుతున్నాయి. పేదధనిక తేడా లేకుండా స్మార్ట్ ఫోన్‌లు, ఇంటర్నెట్ వాడుతుండడంతో గ్రామాల్లో, పట్టణాల్లో వార్డుల వారీగా గ్రూపులు తయారు చేసి పోస్టులు పెడుతున్నారు. వాట్సాప్‌లలో కమ్యూనిటీ గ్రూపులు ఏర్పాటు చేసి పోస్టులు పెట్టడం చేస్తున్నారు. మరోవైపు పోస్టులు రీపీట్‌గా చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

● వాయిస్‌కాల్‌తో ప్రచారం

లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ ముగిసిపోయి బరిలో నిలిచే అభ్యర్థులు తేలడంతో వాయిస్ కాల్ ప్రచారాలు జోరందుకున్నాయి. ఉదయం లేవడంతోనే అందరి ఫోన్‌లలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి అంటూ వాయిస్ కాల్ ప్రచారాలు వస్తున్నాయి. ఎండల్లో అంతంతమాత్రంగానే సాగుతున్న ప్రచారానికి వాయిస్‌కాల్‌లు కాస్తా తోడవుతున్నాయి.

● బెంబేలెత్తిపోతున్న నాయకులు

సోషల్ మీడియాతో వివిధ పార్టీల్లోని నాయకులు బెంబేలెత్తి పోతున్నారు. రకరకాల కామెంట్లు గుప్పించడంతోపాటు పార్టీలు ఫిరాయింపుదారులపై చివరకు వ్యక్తిగత అంశాలను జోడించి పోస్టులు పెడుతునాన్నరు. వ్యక్తిగత కామెంట్లతో పార్టీల నాయకులను కుంగదీస్తున్నాయి.

● అత్యుత్సాహం ప్రదర్శిస్తే కేసులే...

సోషల్ మీడియాలో అత్యుత్సాహంగా పోస్టులు పెడితే క్రిమినల్ కేసుల్లో ఇరుక్కోక తప్పదని ఎన్నికల కమిషన్, పోలీస్ యంత్రాంగం హెచ్చరిస్తున్నాయి. సోషల్ మీడియాలో రాజకీయ పార్టీలను కించపర్చేలా ప్రజలను రెచ్చగొట్టే విధంగా వివాదాస్పద అంశాలతోకూడిన పోస్టులు పెడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. రాజకీయ అంశాలకు సంబంధించి ఎవరైనా ఫిర్యాదు చేసినా ఎన్నికల అధికారులు పరిశీలించి సంబంధింత గ్రూప్ అడ్మిన్, పోస్టు పెట్టిన వ్యక్తిపై ఎన్నికల సంఘం చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. సోషల్ మీడియా వాలంటీర్లు జాగ్రత్తగా లేకుంటే మొదటికే మోసం వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో వ్యక్తి గత ప్రచారాల కంటే సోషల్ మీడియా ప్రచారాలే జోరుగా సాగుతున్నాయి.

బీఆర్ఎస్, బీజేపీకి ఓటు అడిగే నైతిక హక్కులేదు

ముస్తాబాద్, ఏప్రిల్ 29 : బీఆర్ఎస్, బీజేపీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదని రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్ మండల కేంద్రంలోని రాజీవ్ కూడలిలో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పదేళ్లలో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రజలకు చేసేందేమీ లేదన్నారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని మరిచి వ్యక్తిగత అభివృద్ధి చేసుకున్నారని, ఆర్థికంగా ఎదిగారని అన్నారు. కేటీఆర్ పదిహేనేళ్లలో ఇక్కడి ప్రజల కనీస అవసరాలు తీర్చలేపోకపోయారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజల అవసరాలను ఎందుకు గుర్తించలేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, జడ్పీటీసీ గుండం నర్సయ్య, ఎంపీటీసీ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు రాజు, నాయకులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ మండల కో ఆప్షన్ మెంబర్ ఎండీ షాదుల్‌పాషా, ఎంపీటీసీ సభ్యురాలు దుబ్బాక స్వేచ్ఛరాజు, గోపాల్‌పల్లె మాజీ సర్పంచ్ జగ్గ నరేశ్, పలువురు బీఆర్ఎస్ నాయకులు మంత్రి పొన్నం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

తంగళ్లపల్లి: ఓట్లు అడగడానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు వస్తే నిలదీయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. పదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు చేసింది శూన్యమన్నారు. మాజీ ఉపసర్పంచ్ పెద్దూరు తిరుపతి, వార్డు సభ్యుడు రెడ్డి పర్శరాములు, ఇందిరమ్మ కాలనీ మాజీ సర్పంచ్ భైరి శ్రీవాణి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ భైరి రమేష్ కాంగ్రెస్‌లో చేరారు. జడ్పీటీసీ పూర్మాణి మంజుల లింగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాల్గం ప్రవీణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి అక్రమాలు

గంభీరావుపేట: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అవినీతి అక్రమాలు జరిగాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆరోపించారు. గంభీరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావుతో సోమవారం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్ర జరుగుతోందన్నారు. కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వనిత తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరిన మాజీ సర్పంచులు



బీజేపీలోకి ఆహ్వానిస్తున్న బండి సంజయ్ కుమార్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 29: మండలంలోని నాలుగు గ్రామాల మాజీ సర్పంచులు ఎంపీ బండి సంజయ్‌కుమార్ సమక్షంలో సోమవారం బీజేపీలో చేరారు. అనంతారం గ్రామానికి చెందిన మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు చల్ల నారాయణ, గూడెపుపల్లి మాజీ సర్పంచ్ గట్ల మల్లారెడ్డి, కిష్టరావుపల్లె మాజీ సర్పంచ్ ముస్కు మల్లయ్య, చిక్కుడువాణి పల్లె మాజీ సర్పంచ్ లాల రాధారమేష్, బీఆర్ఎస్వీ నాయకుడు చల్ల రాజు బీజేపీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో నిజమైన కార్యకర్తలకు విలువ లేకపోవడంతో రాజీనామా చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు దెశెట్టి శ్రీనివాస్, అమ్ముల అశోక్‌యాదవ్, తిప్పారపు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

మేడే రోజున వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 29 : ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే రోజున జాతీయ సెలవని, జిల్లాలోని కార్మికులందరికీ వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు కోరారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎండీ రఫీకి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూసీ జిల్లా కార్యదర్శి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి రాజశేఖర్, గణేష్ పాల్గొన్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో సిరిసిల్ల వెనుకబాటు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 29: గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో సిరిసిల్ల వెనుకబడిపోయిందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం 36వ వార్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకంపేటకు చెందిన 200 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డలాస్ చేస్తానన్నా కేటీఆర్ సిరిసిల్లను కల్లాస్ చేశారన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, మాజీ కౌన్సిలర్ చంద్రకళ, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలంలో శ్రీగాధ ఎంపీటీసీ వర్మ స్నేహలత, నాగంపేట ఎంపీటీసీ నాగభూషణం, మాజీ సర్పంచ్ కత్తుల బాబు, కొత్తపల్లి, శ్రీగాధ గ్రామాల వివిధ పార్టీల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఓట్ల కోసం నేతన్నల జీవితాలతో కాంగ్రెస్ రాజకీయం



మాట్లాడుతున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 29:పార్లమెంట్ ఎన్నికలల్లో ఓట్లకోసమే కాంగ్రెస్ నేతన్నల జీవితాలతో రాజకీయం చేస్తోందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ మండి పడ్డారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బతుకమ్మ చీరలకు రావాల్సిన రూ.270 కోట్లను చెల్లించాలని, నేతన్నలకు ఉపాధిని కల్పించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో బతుకమ్మ చీరలకు రావాల్సిన రూ.270 కోట్ల బకాయిలను గత బీఆర్ఎస్ ప్రభుత్వంతోపాటు కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించడం లేదని, దీంతోపాటు ఉపాధి కల్పించకపోవడంతోనే నేతన్నలు ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేతన్నల ఆత్మహత్యలకు ఆ రెండు పార్టీలే కారణమన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు చిత్తశుద్ధి ఉంటే వారం రోజుల్లో పెండింగ్‌లో ఉన్న రూ.270 కోట్లను తీసుకొని సిరిసిల్లకు రావాలన్నారు. లేని పక్షంలో గత ప్రభుత్వం బెదిరించి ఓట్లు వేయించుకుంటే ఆ పార్టీకి ఏ గతి పట్టిందో మీకూ అదే గతి పడుతుందని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ జీఎస్టీపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, కేవలం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం జీఎస్టీని పెంచిందని మాట్లాడడం సరైందికాదని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే తీసుకొచ్చిన జీఎస్టీ బిల్లును బీజేపీ ప్రభుత్వం అమలు చేసిందనే విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల నియోజకవర్గ కన్వీనర్ కారెడ్ల మల్లారెడ్డి, నాయకులు కైలాస్, నరేష్, పత్తిపాక సురేష్, గాజుల సదానందం, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు సుంకరి బాలకిషన్, చొప్పదండి శ్రీనివాస్, మహేశుని అనిల్, అంకారపు రాజు, గుడ్ల సురేష్, అనిల్,రాజు, పోశెట్టి, శేఖర్ బాలసాని అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 26: పార్లమెంట్ ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చీటి ఉమేష్‌రావు అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయం మొదలు పెట్టినప్పుడు మోదీ, కేసీఆర్‌కు చరిత్ర లేదని, కాలాన్ని బట్టి వారు చరిత్ర సృష్టించారని, కాలాన్ని బట్టి ఎవరైనా చరిత్ర సృష్టిస్తారని అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ హైదరాబాద్‌లో మేనిఫెస్టోను విడుదల చేశారన్నారు. పదేళ్ల బీజేపీ ప్రభుత్వ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని, దేశంలో దారిద్ర్యం, నిరుద్యోగం తాండవిస్తున్నాయని అన్నారు. మతాలను రెచ్చగొట్టి లబ్ధిపొందడం బీజేపీకి అలవాటైందన్నారు. పార్లమెంట్ సభ్యుడిగా బండి సంజయ్ విఫలమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థిపై వేములవాడలో కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. కేటీఆర్ అహంకారపూరిత మాటలను తగ్గించుకోవలని సూచించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ చేసిన పోరాటాలు ఏమిటన్నారు. లేఖలు రాయడం కేసీఆర్‌తో ఇంటర్వ్యూలు ఇప్పించడం తప్పా ఎంపీగా ఉన్నపుడు చేసిందేమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థికి గంగగుత్తగా ఓట్లు వేసి గెలిపించాలన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్, ఎడమల భూపాల్‌రెడ్డి, సంగం శ్రీనివాస్, మంగ కిరణ్, గంగాధర మహిపాల్, అబ్బు రాజు, దండు మల్లికార్జున్, సంతోష్, షేక్ రియాజ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి



అభినందిస్తున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 29: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించాలని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన మండలంలోని బొప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను స్థానిక ఠాణాలో సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకుని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్‌సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. అన్ని విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ అందించనున్నామన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఎస్ఐ రమాకాంత్, పీఈటీ ప్రభాకర్ ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 29: కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతు ఇవ్వాలని సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులను కాంగ్రెస్ నాయకులు కోరారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) కార్యాలయాలలో వేర్వేరుగా ఆయా పార్టీ జిల్లా నాయకులతో కాంగ్రెస్ టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ సమావేశమయ్యారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతు కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు, పట్టణ కార్యదర్శి రవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణు, నాయకుడు నాగరాజు, సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకుడు దశరథం, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యెల్లారెడ్డి, కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి రవి, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బాలయ్య, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు వెంకటరమణ, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు నర్సయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 29: రిజర్వేషన్లు తొలగిద్దామంటున్న బీజేపీ ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు మచ్చ రాజేశం అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగించే అవకాశం ఉందన్నారు. నాయకులు లింగం, న్యాత బాబు, కాసుపాక రమేష్, కొత్తపల్లి బాబు, రాజయ్య, కుమార్, మోహన్, పర్శరాం, దాసు, కేశవులు, చంద్రమౌళి పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి, దేశ భద్రత



బండలింగంపల్లిలో మాట్లాడుతున్న నాయకులు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 29:పార్లమెంటు ఎన్నికల్లో దేశ అభివృద్ధి, భద్రత కోసం బీజేపీని గెలిపించాలని ఎంపీపీ బండ మల్లేశం, పార్టీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి కోరారు. సోమవారం పలు గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ని మరోమారు గెలిపించాలని కోరారు.

ముస్తాబాద్: మండల కేంద్రంతోపాటు గూడూరు నామాపూర్, చీకోడ్ తదితర గ్రామాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు తిరుపతి, రాజు, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ మాజీ మండల ధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్ మాట్లాడుతూ కరీంనగర్ ఎంపీగా సమస్యలపై అవగాహన ఉన్న, స్థానికుడైన బండి సంజయ్‌కుమార్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, ముత్తక్క, చంద్రం పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : ప్రధానిగా మరోసారి నరేంద్రమోదీని ప్రజలు కోరుకుంటున్నారని, గ్రామాల్లో బీజేపీని ఆదరిస్తున్నారని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, బండలింగంపల్లి, సింగారం, కోరుట్లపేట గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి సోమవారం బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.నాయకులు బుగ్గారెడ్డి, అంజనేయులు, బాలగౌడ్, కిరణ్‌నాయక్, లక్ష్మారెడ్డి, గణేశ్, శ్రీశైలం, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోనరావుపేట: కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ అన్నారు. కోనరావుపేట మండలం కొలనూరు తదితర గ్రామాల్లో సోమవారం ఇంటింటా ప్రచారాన్ని కొనసాగించారు. మోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. బండి సంజయ్‌ని గెలిపించాలని కోరారు.



సంక్షేమ పథకాలపై వివరిస్తున్న ఎంపీపీ బండ మల్లేశం

వినోద్‌కుమార్‌కు అండగా నిలవండి



కందికట్కూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్/ఇల్లంతకుంట, ఏప్రిల్ 29: అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు అండగా నిలబడాలని జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు పిలుపునిచ్చారు. మండలంలోని కందికట్కూర్‌లో సోమవారం మాజీ ఏఎంసీ చైర్మన్ చింతపల్లి వేణురావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు ఏనాడూ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. సమస్యలపై అవగాహన ఉన్న వినోద్‌కుమార్ గెలవడంతోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రశ్నించే గొంతుకకు అవకాశం ఇవ్వాలన్నారు. నాయకులు తూటి పర్శరాం, శేఖర్‌గౌడ్, వెంకటేశం పాల్గొన్నారు.

●కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం 3వ వార్డులో గడప గడపకు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ నాడు తెలంగాణ హక్కుల సాధన కోసం వినోద్‌కుమార్ పోరాటాలు చేశారన్నారు. మరోసారి ఎంపీగా వినోద్‌కుమార్‌న గెలిపించాలని కోరారు. పోచమ్మ తల్లి దేవాలయం మాజీ ధర్మకర్త ఈశ్వరి, బీఆర్ఎస్ వార్డు నాయకులు మేర్గు శేఖర్, దూస రాజేశం పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ప్రజా సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు పదిర, నారాయణపూర్, గొల్లపల్లి తదితర గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వినోద్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం ధర్మారంతోపాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు సోమవారంకరీంనగర్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను గెలిపించాలని ఇంటింటా ప్రచారాన్ని కొనసాగించారు. బీఆర్ఎస్ నాయకులు సిద్ధంశెట్టి శ్రీనివాస్, నాగుల రాజు, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య